క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గార: మండలంలోని శిమ్మపేట గ్రామ దేవత కర్ణమాంబ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులు పాటు జరగనున్నాయి. గ్రామ పురోహితులు దార్ల పూడి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఆర వెల్లి బాలభాస్కరశర్మచే సోమవారం విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, లక్ష్మీగణపతి హోమం, మంగళవారం మండల మంటపారాధన, సామూహిక కుంకుమార్చన, బుధవారం ఉదయం రోహిణి నక్షత్రయుత అమ్మవారి వృక్షసహిత విగ్రహపాదుకమూర్తి ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం ప్రతీ ఇంటి నుంచి అమృత కలశాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అభిషేకాలు జరిపారు.

కోమలరావుకు సన్మానం



కోమలరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరంలో ప్రముఖ వక్త డాక్టర్ బి.కోమలరావును మందిరం సభ్యులు ఆదివారం సత్కరించారు. అంతకు ముందు 'ఉత్తమ మనువు మహిమాభివర్ణనము' అనే అంశంపై ఆయన సాహిత్య ప్రసంగం చేశారు. వ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాల్లో ఒకటైన మార్కెండేయ పురాణాన్ని తెలుగులోకి మారన కవి అనువదించారని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, జామి బాలరాజు, సూరిబాబు, రామారావు, మల్లేశ్వరరావు, సరస్వతి, లక్ష్మీ, అరుణకుమారి, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం పంచాయతీ లోచర్లపాలెం గ్రామానికి చెందిన టొంపల రామారావు అనే వ్యక్తికి ప్రమాదవశాత్తు రెండు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. ప్రస్తుతం అతను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతనికి హృదయాలు ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ వితరణ



మజ్జిగ అందజేస్తున్న ఈవో నరసింహనాయుడు తదితరులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో స్థానిక కూర్మనాథ సేవకుల బృందం దర్శనానికి వచ్చే దూరప్రాంత భక్తులకు మజ్జిగను ఆదివారం అందజేశారు. కార్యక్రమాన్ని తాబేళ్ల పార్కు సమీపంలో ఆలయ ఈవో కె.నరసింహనాయుడు ప్రారంభించారు. చైత్రమాసంలో ప్రతీ ఆదివారం వీటిని నిర్వహిస్తామని బృంద సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కై బాడి రాజు, అనుపోజు రమణమూర్తి, కస్పా మురళీ, కోరాడ అప్పలరాజు, మాణిక్యాలరాజు, జామి శ్రీను, కోరాడ రమేష్, పిట్ట నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తులు

రణస్థలం: రానున్న 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఈవో ఎ.త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాస సమీప ప్రాంతంలో ఉన్న అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారని చెప్పారు. విద్యార్థులు ఆధార్ ద్వారా ప్రాథమిక వివరాలతో సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రారంభమైన వంతెన పనులు

రణస్థలం: రణస్థలం జాతీయ రహదారి టౌన్‌లో ఎస్‌ఈపీఎల్ కాంట్రాక్టర్ రూ.137 కోట్లతో చేపట్టనున్న వంతెన పనులు ప్రారంభమయ్యాయి. రావివలస, దన్నానపేటకు ఇరు వైపులా ప్రస్తుతం కాలువ పనులు మొదలయ్యాయి. మరో మూడు నెలల తర్వాత టౌన్‌లో చేపడతామని హైవే అధికారులు చెబుతున్నారు. పనులు జరిగే ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టారు. వాహనదారులు గమనించి ప్రయాణం సాగించాలని సూచిస్తున్నారు.

ఉపాధి హామీ.. సౌకర్యాలు లేమి..!

- ఉపాధి పనుల్లో సౌకర్యాలు కరువు
- మండుటెండలో వేతనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మండుటెండలో పనులు చేస్తున్న వేతనదారులు

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో మండుటెండలో పనిచేసే సమయంలో వేతనదారులు విశ్రాంతి తీసుకోవడానికి, తాగడానికి సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఎంతోమందికి జాబుకార్డులను అధికారులు మంజూరు చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వేతనదారులకు పక్కాగా పనిచేసినచోట టెంట్లు, నీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, ఇంతవరకు ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. అధికారులు పనుల పర్యవేక్షణకు వచ్చినప్పుడు వేతనదారులు నిలదీస్తున్నా స్పందన కనిపించడం లేదు.

మండుటెండలో పనులు

గ్రామాల నుంచి సుమారుగా 2 నుంచి 4 కిలోమీటర్ల వరకు నడిచివెళ్లి మండుటెండలో వేతనదారులు పనులు చేస్తున్నారు. పనులు చేస్తున్న సమయంలో వడదెబ్బకు ఎవరైనా గురైతే అక్కడ సేదదీరేందుకు నీడలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిలో భాగంగానే ఇప్పటికే పలు గ్రామాల్లోని వేతనదారులకు స్పృహ కోల్పోయే పరిస్థితి నెలకొంది. జి.సిగడాం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఇంతవరకు 15వేల మందికి పైగా ఉపాధి పనులు చేస్తున్నారు. వీరు అసౌకర్యాల నడుమ పనులు చేస్తున్నప్పటికీ రోజుకి రూ.200లు కంటే ఎక్కువ వేతనం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులేమో పనిచేసిన గంటలను పొడిగించి వేతనాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

సదుపాయాలు లేవు



మా గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి మండుటెండలో పనిచేస్తున్నాం. అక్కడ తాగేందుకు నీరులేక, తలదాచుకునేందుకు నీడలేక, ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స కిట్లులేక వేతనదారులంతా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వేతనదారులు స్పృహ కోల్పోయారు.

– కె.నీలవేణి, ఉపాధి వేతనదారు, మర్రివలస

ఇబ్బందులు పడుతున్నాం



మండుటెండలో పనిచేస్తూ సేదదీరే సమయంలో నీడలేక ఇబ్బందులు పడుతున్నాం. ఎండలో గొంతెండుతున్నా తాగునీరు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు స్పందించి పనిచేసిన ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– డి.ఈశ్వరమ్మ, ఉపాధి వేతనదారు, మానంపేట

చర్యలు తీసుకుంటున్నాం



ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేసే ప్రదేశంలో వేతనదారులకు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో వేతనదారులకు నీడ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెంట్లు మంజూరు చేసింది. కొన్ని ప్రాంతాల్లో నీడ కోసం వాటిని వినియోగిస్తున్నాం. మరికొన్ని ప్రాంతాల్లో నీడను ఏర్పాటు చేసుకోవాలని సూచించాం.

– గుంటముక్కల రామకృష్ణారావు, ఎంపీడీవో, జి.సిగడాం

● భక్తులకు అవస్థలు



శ్రీకూర్మంలోని ప్రధాన వీధిలో ఆలయ ఉత్తర గాలిగోపురం రోడ్డుకిరువైపులా దుకాణదారులు రోడ్డుపైనే దుకాణాలు పెడుతుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు దుకాణం మెట్లు నుంచి ముందుకొచ్చి గొడుగులు వేసి అమ్మకాలు చేసుకుంటున్నారు. గతంలో ఆలయ అధికారులు రోడ్డు మార్కింగ్ చేయించి, దాటి రావద్దని హెచ్చరించినా మార్పు కనిపించలేదు. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– గార

● విద్యుత్ వృథా



ఎచ్చెర్ల మండలంలోని బుడగుట్లపాలేం గ్రామంలో పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు పంచాయతీకి భారంగా మారుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి, పగటపూట వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

చంద్రబాబు ప్రకటనలు అవాస్తవం



గేదెల పురుషోత్తం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మత్స్యకారుల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనలన్నీ అవాస్తవాలేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన కూటమి నాయకులు బుడగట్లపాలెంలో అన్నీ మోసపూరిత విధానాలతో కూడిన మాటలే చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం ఒక విడత మత్స్యకార భరోసాకు ఎగనామం పెట్టిందన్నారు. మత్స్యకారుల జీవితాలు మార్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. డీజిల్ సబ్సిడీ, మత్స్యకార భరోసా నిధులు, చేపల నిల్వ కేంద్రాల నిర్మాణం, హార్బర్లు, పోర్టుల అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. బుడగట్లపాలెం హార్బర్ నిర్మాణం కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన దేనన్నారు. చంద్రబాబు పాలన అంతా మోసమని, కేవలం ఫొటోలకు ఫోజులు ఇవ్వడమే ఆయనకు తెలుసని, ఇచ్చిన హామీలు అమలు చేసే చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ఇకనైనా అబద్ధాలు మానుకోకపోతే ప్రజాగ్రహానికి గురవ్వక తప్పదని హితవు పలికారు.



ప్రసాదాల కోసం బారులుతీరిన దృశ్యం

ఆదిత్యునికి విశేష పూజలు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ ఆరోగ్య క్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఆదివారం ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి విశేష పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో గోత్రనామాలతో అర్చనలు చేయించారు. అంతరాలయంలో ప్రత్యేక అలంకరణలతో స్వామివారి సర్వదర్శనాలకు అనుమతివ్వడంతో భక్తులు వివిధ దర్శనాల మార్గాల్లో బారులుతీరి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అయితే బయట ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులు ఒకింత అవస్థలు పడ్డారు. ఆలయ అధికారులు పెద్దగా ఏర్పాట్లు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం వేకువజామునే భక్తులు అరసవల్లికి చేరుకుని కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మేడే విజయవంతం చేయాలి



మేడే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గార: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ జల్లు కాంచన ఆధ్వర్యంలో మేడే కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్త, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏ, స్కూల్ స్వీపర్ తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్లకు దేశ సంపదను దోచిపెడుతూ కార్మికుల, కర్షకులకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల నాయకులు సుజాత, జగన్, దాలినాయుడు, అప్పన్నమ్మ, ఉదయం కుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతామణి అమ్మవారికి పూజలు



ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బెజ్జిపుట్టుగకు చెందిన కాళికావేషధారుల నాట్య ప్రదర్శన నడుమ అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో కవిటి పట్టణ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

– కవిటి

భానుడి భగభగ



ఎండలో ప్రయాణం చేస్తున్న దృశ్యం

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు, మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఉదయం 9 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఉక్కపోత నుంచి ఉపశమనానికి చల్లని కూల్‌డ్రింక్స్, చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు.

– జి.సిగడాం



చెట్లు కింద ఉన్న మూగజీవాలు

పట్టుదల ఉంటే ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: కృషి, పట్టుదల ఉంటే ఉద్యోగ అవకాశాలు మన వెంటే వస్తాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కణితి శ్రీరాములు అధ్యక్షతన మెగా జాబ్‌మేళా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ యువత లక్ష్య సాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఎంతటి కష్టతరమైన పనైనా విజయవంతమవుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ పరిశ్రమల నిర్మాణానికి కొంతమంది వ్యతిరేకిస్తున్నారని, ఇటువంటి చర్యలను అందరూ ఖండించి, పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి దారుణం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడిచేసి అమాయకుల ప్రాణాలు తీయడం దారుణమని మాజీ సర్పంచ్ పలిశెట్టి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని పాలఖండ్యాం గ్రామంలో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ ఆదివారం నిర్వహించారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డీలర్ ఎం.ఈశ్వరరావు, నాయకులు పి.వేణు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నీటిగండం!

- అడుగంటిన చెరువులు
- నీటి కోసం విలవిల్లాడుతున్న పశువులు



టెక్కలిపట్నంలో ఎండిపోయిన చెరువు

కాశీబుగ్గ: మండుతున్న ఎండల ప్రభావం పశువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడం.. వేసవి నేపథ్యంలో చెరువులన్నీ అడుగంటిపోయాయి. ఎక్కడ కూడా చుక్క నీరు లేకపోవడంతో తాగునీటి కోసం పశువులు అల్లాడి పోతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి వాటి యజమానులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. పలాస నియోజకవర్గం పరిధిలోని మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తాగునీటి కోసం తహతహలాడుతున్నాయి. ఈ పరిస్థితిలో సుదూరంగా ఉండే బావుల వద్దకు పశువులను వాటి యజమానులు తీసుకొని వెళ్లి వాటికి నీటిని అందించి దాహార్తి తీరుస్తున్నారు.



నీరు లేని చెరువులో మేత మేస్తున్న గేదెలు

పలాస నియోజకవర్గంలో పశువుల వివరాలు

పలాస పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుల కార్యాలయం పరిధిలో మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆవులు 31,656, గేదెలు 6,648, గొర్రెలు, మేకలు 42,962 ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. వాటి యజమానులు వీటిని రక్షించుకోవడానికి అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు శ్రద్ధ వహించి చెరువులను నీటితో నింపాలని, అలాగే అవసరమైన ప్రదేశాలను గుర్తించి నీటితొట్టెలను ఏర్పాటు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువులను కాపాడుకోవడం కష్టమే



వేసవి నేపథ్యంలో చెరువులు, వాగులు పూర్తిగా ఎండిపోయాయి. నీరులేక పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. పలాస మండలం రేగులపాడు గ్రామానికి చెందిన పశువులను సమీపంలో ఉన్న మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. అందులో కూడా నీరు అడుగంటింది. ఇదే పరిస్థితి ఉంటే పశువులను కాపాడుకోవడం కష్టమే. అధికారులు స్పందించి చెరువుల్లో నీటిని నింపాలి. అవసరమైన చోట నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలి.

– పానిల కూర్మారావు, రేగులపాడు గ్రామం, పలాస మండలం